
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 వరంగల్
శుక్రవారం 29 ఆగస్టు 2025



సాదా బైనామాలకు రైట్ రైట్

- హైకోర్టు తీర్పుతో క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన జీవో 112పై హైకోర్టులో కేసు
- పాత చట్టం స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం రావటంతో తొలిగిన అడ్డంకులు
- క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు
- భూ భారతి సదస్సుల్లో భారీగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,66,784 దరఖాస్తులకు కలగనున్న మోక్షం

ఐదున్నరేళ్ల రైతుల ఎదురుచూపులకు తెర

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సాదా బైనామాలకు అడ్డంకులు తొలిగాయి. ఐదున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు ప్రభుత్వం సాదా బైనామాల పరిష్కారంపై విధివిదానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను కొట్టివేసింది. ప్రభుత్వం సాదా బైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2020 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,784దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లోనూ భారీగా సైదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదా బైనామాలకు మోక్షం కలుగుతుందనే ఆనందంలో అన్నదాతలు ఉన్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది సాదాబైనామాలు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్దత కల్పించాలని నిర్ణయించారు. 12 అక్టోబరు 2020లో కూడా జీవో నెంబరు 112ను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన సాదాబైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో జీవో నెంబరు 112ద్వారా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలును నిలిపివేస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్దత కల్పిస్తుందనే ఆశతో అప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో వరంగల్ జిల్లాలో 26,630 పెండింగ్ సాదాబైనామాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో 27,057 దరఖాస్తులు, జనగామ జిల్లాలో 10,350 దరఖాస్తులు, మహబూబాబాద్ జిల్లాలో 31,250 దరఖాస్తులు, ములుగు జిల్లాలో 20,150 దరఖాస్తులు, భూపాలపల్లి జిల్లాలో 51,347 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల నిర్వహించిన భూభారతి

(మిగతా 7లో..)

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ...

- కన్నుల పండువగా మొదలైన నవరాత్రి వేడుకలు
- వాడవాడనా మండపాల్లో కొలువైన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో కొనసాగిన ప్రతిష్ఠాపన వేడుకలు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు.. ప్రత్యేక పూజలు
- ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడే..


హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జిల్లా ప్రజలు జరుపుకున్నారు. బాద్రప్రద శుద్ధ చవితి బుధవారం ఉదయం 10.30 గంటల వరకు వర్షం ఉండటంతో 11 గంటల తరువాత భాజాభజంత్రీలు, మేళతాళాలతో అట్టహాసంగా గణేష్ మండళ్ల నిర్వాహకులు ప్రత్యేకంగా శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపాల్లో గణనాథుడి ప్రతిమలను నిలిపి తొలిపూజలను నిర్వహింపజేశారు. అదే విధంగా బుల్లి గణపయ్యలను ప్రతీ ఇంట ప్రతిష్ఠింపజేసి

(మిగతా 6లో..)



ఎల్లంబజార్‌లోని 45 అడుగుల భారీ గణేషుడు





సత్యం కంప్యూటర్స్ ఆధ్వర్యంలో డ్రైఫ్రూట్స్‌తో కొలువుదీరిన గణనాథుడు, కాకతీయ యూత్ జేపీఎన్‌రోడ్‌లో కొలువుదీరిన గణనాథుడు

జోరుగా వర్షాలు

హసన్‌పర్తిలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. హనుమకొండ జిల్లాలో సరాసరి 26.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. హసన్‌పర్తి మండలంలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం పడింది. భీమదేవరపల్లి మండలంలో 9.2 మి.మీ, వేలేరులో 20.8 మి.మీ, ఎల్కతుర్తిలో 13.6 మి.మీ, కమలాపూర్‌లో 42.9 మి.మీ, హసన్‌పర్తిలో 44.2 మి.మీ, దర్మసాగర్‌లో 16.2 మి.మీ, కాజీపేటలో 28.2 మి.మీ, హనుమకొండలో 31.6 మి.మీ, ఐనవోలులో 5.1 మి.మీ, పరకాలలో 33.2 మి.మీ, దామెర లో 38.2 మి.మీ, ఆత్మకూరులో 31.7 మి.మీ, శాయంపేటలో 31.3 మి.మీ, నడికూడలో 20మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరిక కేంద్రం తెలిపింది. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా అతి భారీ వర్షాలు కురవవచ్చునని పేర్కొన్నది.

సీఎంది మోసం.. మాజీ సీఎంది వైఫల్యం..

- పేదల బతుకులంటే ఎందుకింత చిన్నచూపు
- పెన్షన్లు పెంచి, కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోతే యుద్ధమే
- సెప్టెంబర్ 9న హైదరాబాద్ మహాగర్జనను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి చేసింది మోసమైతే, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్నదని వైఫల్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. పేదల బతుకులంటే మీకెందుకంత చిన్నచూపంటూ ఇద్దరినీ తూర్పార బట్టారు. ధనిక సామాజిక వర్గంలో పుట్టిన మీకు పెన్షన్‌దారులంటే ఓ రకమైన భావన ఉందని, కానీ పూరి గుడిసెలో పుట్టిన తనకు వారంటే ప్రేమ ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ వారి బాధలను భుజాన వేసుకుని మోస్తూ మిమ్మల్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఓ గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ పెన్షన్ దారుల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబరు 9న సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెన్షన్ దారులైన వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు ఇతరులకు రూ.4వేలు ఇస్తానన్న ముఖ్యమంత్రి మాటలను వీడియో ద్వారా సాక్షాలు చూపుతూ సభలో ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ ఉంటే రూ.2 వేలే, నేనొస్తే రూ.4 వేలంటూ నమ్మబలికించి సీఎంగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని ఆరోపించారు. 20నెలలుగా పెన్షన్ దారులను, కొత్తగా మంజూరి కావాల్సిన వారిని పట్టించుకోకుండా ప్రభుత్వం తప్పించుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 45 లక్షల మంది పెన్షన్‌దారులు, మరో 10లక్షల మంది కొత్తగా మంజూరు కావాల్సిన వారున్నారని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి అధికారంలోకి వచ్చాక ఆ లెక్క మరిచిపోయాడా అని ప్రశ్నించారు. రూ. 200 ఉన్న పెన్షన్‌ను నేడు రూ.2వేల వరకు సాధించేలా పోరాటం చేసిన

(మిగతా 6లో..)



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

హాకీ... ఏకాకి..

- దేశవాళి క్రీడగా ప్రసిద్ధిగాంచిన క్రీడపై నీలినీడలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరాదరణ
- పట్టించుకోని క్రీడా సంఘాలు, అధికారులు

7

కొత్త పత్తి వచ్చేసింది..

ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన రైతు



6

కొత్తపత్తిని అమ్మకానికి తీసుకువచ్చిన రైతుతో అడ్తిదారు, ఖరీదుదారు

కేయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇంజనీరింగ్ సప్లిమెంటరీ 3, 5, 7, 8వ సెమిస్టర్, ఐదేళ్ల న్యాయశాస్త్ర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల షెడ్యూల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ అసీం ఇక్బాల్‌లు విడుదల చేశారు. బీటెక్ మూడో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 2, 4, 8, 10, 12, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. బీటెక్ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1, 3, 6, 9, 11, 15, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. బీటెక్ ఏడో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 2, 4, 8, 10, 12, 16 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. కేయూ కో ఎడ్యుకేషన్, వుమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. న్యాయశాస్త్రం ఐదేళ్ల రెగ్యులర్ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1, 3, 6, 9, 11 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులు పరీక్షలు రాసుకునే అవకాశం వుంది. పరీక్షల కేంద్రాలను సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ క ళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో ఏర్పాటు చేశారు.

రీషెడ్యూల్ పరీక్షల తేదీలివే..

భారీ వర్షాల కారణంగా ఆగస్టు 28, 29 తేదీల్లో జరుగాల్సిన పరీక్షల రీ షెడ్యూల్‌ను గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రకటించారు. ఆగస్టు 28న జరుగాల్సిన కేయూ ఎంఈడీ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పేపర్ -4 సబ్జెక్టును సెప్టెంబరు 3న జరుగుతోంది. 28న జరగాల్సిన కేయూ బీఫార్మసీ సీబీసీఎస్ నాలుగో సెమిస్టర్ పేపర్-2 పరీక్షల సెప్టెంబరు 6వ తేదీన జరుగుతుందని ప్రకటించారు. ఆయా పరీక్షలు గతంలో ప్రకటించిన విధంగా యథావిధిగా పరీక్షల కేంద్రాలు, టైం టేబుల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌ను చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

ఈనెల 28, 29 కేయూ పరీక్షలన్నీ వాయిదా

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరుగాల్సిన డిగ్రీ, పీజీతో సహా అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ గురువారం స్పష్టం చేశారు. తెలంగాణలో భారీ వర్షాల కారణంగా రెండు రోజులు పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మిగతా పరీక్షలన్నీ గత షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వెల్లడించారు. వాయిదా వేసిన పరీక్షల రీషెడ్యూల్ తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

కాజీపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. (17003)కాజీపేట-సిర్పూర్ టౌన్ వెళ్లే రామగిరి ప్యాసింజర్ రైలు అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట-బల్లార్షల మధ్య నడిచే కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భద్రాచలం నుంచి సిర్పూర్ బల్లార్ష మధ్య నడిచే సింగరేణి ప్యాసింజర్ భద్రాచలం నుంచి కాజీపేట మధ్య మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

మద్యం టెండర్లపై కసరత్తు

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంపు
- 2025-27 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి అధికారుల కసరత్తు
- డిసెంబరు 1 నుంచి అమలులోకి రానున్న కొత్త మద్యం పాలసీ
- ఇంకా ఖరారు కాని తేదీలు
- టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్న లిక్కర్ వ్యాపారులు



వరంగల్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల టెండర్లకు కసరత్తు మొదలైంది. 2025-27 సంవత్సరానికి గాను కొత్త మద్యం పాలసీని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఏ-4 లిక్కర్ షాపుల లైసెన్సుల జారీకి ప్రభుత్వం ఈనెల 20న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో వైన్‌షాపుల టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రస్తుతం అమల్లో వున్న 2023-25 సంవత్సరం టెండర్ వచ్చే నవంబరు 30తో ముగిసిపోనుంది. ఆ లోపు దరఖాస్తులు, టెండర్‌లు, లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సిద్ధమవుతున్నారు.

దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

2025-27 సంవత్సరం మద్యం పాలసీలో భాగంగా టెండర్ల దరఖాస్తు పీజును రూ.3 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో 2023-25 సంవత్సరంలోని మద్యం పాలసీలో లైసెన్సు ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించారు. ఈసారి మరో రూ.ఒక లక్షను పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే అర్హులని అధికారులు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలోని 63 మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. వరంగల్ జిల్లాలో మొత్తం మూడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉండగా, వాటిలో పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 22, నర్సంపేట 25, వర్ధన్నపేట పరిధిలో 16 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించనున్నారు. గత టెండర్‌లో 2,938 దరఖాస్తుల ద్వారా రూ.58 కోట్ల 76లక్షలు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల సంవత్సరం కావడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత టెండర్ల కన్నా రెట్టింపు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి అధికారులు 4వేలకు పైగా దరఖాస్తులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వ్యాపారులు ముందుకు వచ్చేనా..

2025-27 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు మద్యం వ్యాపారులు ముందుకు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. మద్యం దుకాణాలను పొందాలంటే ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలు చెల్లించాలి. గతంలో రూ.2 లక్షలు ఉండేది. ఈసారి అదనంగా రూ.లక్ష పెంచడంతో వ్యాపారులు తక్కువ మొత్తంలో దరఖాస్తులు చేసే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా సాధారణంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించిన తర్వాత వెంటనే డ్రా తీసి దుకాణాలను కేటాయించి నెల రోజుల్లో నూతన దుకాణాలు ప్రారంభం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేది.

ఇంకా దుకాణాల లైసెన్సుల గడువు మూడు నెలలకు పైగా ఉన్నప్పటికీ ముందుగానే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా నూతన దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించి డ్రా నిర్వహించి లైసెన్సు ఫీజును తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. డ్రాలో మద్యం దుకాణం పొందిన వారు మూడు నెలల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రూ.లక్షలు, కోట్లు వెచ్చించి దరఖాస్తులు చేసి మద్యం దుకాణం పొందిన తర్వాత మళ్లీ లైసెన్సు ఫీజు కూడా రూ.లక్షల్లో చెల్లించి నాలుగు నెలలు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో వ్యాపారులకు వడ్డీ భారం తప్పడం లేదు. ప్రభుత్వం మద్యం వ్యాపారులకు ఇచ్చే లాభాలు మాత్రం పెంచడం లేదు. దీంతో దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో తేదీలను ఖరారు చేస్తాం..



ప్రభుత్వం ఏ-4 మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తులు, టెండర్లు, లక్కీ డ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే దరఖాస్తుల తేదీలను ప్రభుత్వం ఖరారు చేస్తుంది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ ప్రతీ దరఖాస్తుకు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

- డి.అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఎక్సైజ్ శాఖ, వరంగల్ జిల్లా

కొత్త పత్తి వచ్చేసింది..

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం కొత్త పత్తి అమ్మకానికి వచ్చింది. హనుమకొండ జిల్లా నాగారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఐదు బస్తాల కొత్త పత్తిని అమ్మకానికి తీసుకువచ్చాడు. కల్పన అండ్ కో అడ్తికి రాగా మారుతి ఆయిల్ మిల్ ఖరీదుదారు క్వింటాల్‌కు రూ.6,921 చొప్పున కొనుగోలు చేశారు. ఇదిలా ఉంటే మార్కెట్‌కు కొత్త పత్తి అమ్మకానికి వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు, వ్యాపారులు, అధికారులు కొత్త పత్తిని చూసి రైతుతో మాట్లాడి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను జూన్ మొదటి వారంలోనే మూడెకరాల్లో పత్తి సాగు చేశానన్నారు.ఇప్పుడిప్పుడే కాయలు పడి పత్తి వస్తుంటే తొలిసారి అమ్మకానికి తీసుకువచ్చానని చెప్పారు.

నిమజ్జనానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

పోచమ్మమైదాన్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద, గ్రేటర్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయితో కలిసి గురువారం ఎంపీ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. క్రేన్‌లు, తెప్పలు రద్దీకి సరిపోయేలా సిద్ధంగా ఉంచాలని, రద్దీని నియంత్రిస్తూ పటిష్టమైన భద్రత కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు రాయల ప్రభాకర్, షేక్ సలీమా, వరంగల్ సబ్‌డివిజన్ ఏఎస్పీ శుభం ప్రకాష్ పాల్గొన్నారు.

గణపతి విగ్రహాలకు జియో ట్యాగింగ్



జియోట్యాగింగ్ చేస్తున్న

వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గణపతి విగ్రహాల లొకేషన్‌తో పాటు ఆన్‌లైన్ తనిఖీలను ఉన్నతాధికారులు పరిశీలించేందుకు వీలుగా ఉండేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్ ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాల జియో ట్యాగింగ్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని 3 జోన్‌లలో ఇప్పటి వరకు 4,200 మండపాల నిర్వహకులు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందగా సుమారు 2,000 విగ్రహాలకు జియోట్యాగింగ్ అయినట్లుగా సమాచారం. కాగా, జియో ట్యాగింగ్ ద్వారా మండపం వద్ద జరగరాని సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడానికి సలువుగా ఉండటం, తొమ్మిది రోజుల పాటు పాయింట్ బుక్‌లో సిబ్బంది నిర్వహించే తనిఖీలను సంబంధిత ఎస్‌హెచ్‌ఓతోపాటు పోలీస్ కమిషనర్ వరకు పరిశీలించేందుకు వీలుంటుందని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే విధంగా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం అయ్యాయనే విషయం సైతం జియో ట్యాగింగ్ ద్వారా ఉన్నతాధికారులకు చేరుతుంది. తనిఖీల సమయంలో సిబ్బంది ట్యాబ్‌లో మండపంవద్ద నుంచి విగ్రహం ఫొటోతో పాటు అక్కడే ఉన్న రిమార్క్స్‌ను ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లే అవకాశం ఉంది. ఈ జియో ట్యాగింగ్ విధానంను వేగంగా పూర్తిచేసేందుకు కమిషనరేట్ పోలీసులు ఆయా మండపాలను సందర్శించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

సీఎంది మోసం.. మాజీ సీఎంది వైఫల్యం..

(5వ పేజీ తరువాయి)

మాకు మీరిచ్చిన హామీని అమలు ఎలా చేయించుకోవాలో కూడా తెలుసన్నారు. ఇక మాజీ సీఎం కేసీఆర్ అధికారంలోకి వస్తే ఇదేవిధంగా పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి రాలేదన్నారు. కానీ, ప్రశ్నించే స్థానంలో ప్రజలు కూర్చోబెడితే ఫాంహౌస్‌లో పడుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజల తరఫున మాట్లడకుండా, అసెంబ్లీకి వెళ్లకుండా మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్షంగా ఎందుకున్నాడని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ మోసం చేస్తే, బీఆర్ఎస్ వైఫల్యం చెందుతోందని ఆరోపించారు. గతంలో వీరిద్దరు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర శిష్యరికం పొందిన వారే కదా, మరి అతన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు.

బువ్వ కరువై, బతుకు బరువైన వృద్ధులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంతోనే తాను వారిని తన భుజాలపై ఎత్తుకుని ప్రశ్నించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 89 నియోజకవర్గాలు పూర్తి చేసుకు ని, మరో 30 నియోజకవర్గాలు పూర్తి చేసి, రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 9న హైదరాబాదులో భారీ మహాగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో గోలి సుధాకర్, జోగుల కుమారస్వామి, ఐత రాజు, రమేశ్, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- మైనారిటీ గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



మైనారిటీ గురుకులాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

శంభునిపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించాల్సిన వసతులు, సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ ఎంపీ కడియం కావ్య హెచ్చరించారు. నగరంలోని రంగశాయిపేట జక్కలొద్దిలో గల మైనారిటీ గురుకుల కళాశాలను గురువారం ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని వంట గదిని పరిశీలించారు.. స్టోర్ రూమ్, కిచెన్, హాస్టల్, గురుకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం వండిన వంటలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, హాస్టల్, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరంవిద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో అందిస్తున్న మౌలిక వనరులను ఉపయోగించుకొని కష్టపడి చదవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష సాధన కోసం కృషి చేయాలన్నారు. మానసిక ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. వివిధ పాఠ్యాంశాల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి విద్యా ప్రమాణా లు, సదుపాయాల గురించి మాట్లాడారు. గురకులం భవనంపై నుంచి నీరు కారుతుండడాన్ని గుర్తించి పరిశీలించారు. మరమ్మతు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

దామెర చెరువు కట్టను మరమ్మతు చేయాలి

గురుకులం పక్కనే ఉన్న దామెర చెరువును ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదలు కళాశాల భవనంపై నుంచి పరిశీలించారు. చెరువు నీటి సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం, ఇతర అంశాలను నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుకట్ట బలోపేతానికి చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్, డీపీఆర్వో అయూబ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి రాజనర్సింహ

వరంగల్ మెడికల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల వైద్య శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలలో వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. పురపాలక, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, స్నేక్ బైట్‌లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వచ్చే రెండుమూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు.

రాజకీయ లబ్ధికోసమే ఓట్ల చోరీ స్టంట్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి
- నాయిని అడ్డిమారిలో గెలిచాడు : రావుల కిషన్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓట్ల చోరీ కథను దేశవ్యాప్తంగా నడిపిస్తున్నాడని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఎన్నికల సమయంలో ఏదో ఒక స్టంట్‌లో భాగంగా జోడో యాత్ర, పాద యాత్ర పేరిట ప్రజల్లోకి రావడం రాహుల్‌కు అలవాటైపోయిందన్నారు. ఎప్పటిలాగే ఇప్పుడు ఓట్ల చోరీ డ్రామాతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ముందు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై నాయిని దృష్టిసారించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి హితవు పలికారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్ మాట్లాడుతూ.. నాయిని రాజేందర్‌రెడ్డి అడ్డిమారిలో ఎమ్మెల్యేగా గెలుపొందాడని, ఎద్దేవా చేశారు. మద్యం దందా, ఇళ్ల దందాలో ఆయనతోపాటు బస్వరాజు సారయ్య పాత్ర ఏమిటో వరంగల్ ప్రజలందరికీ తెలుసన్నారు. బాలసముద్రంలోని డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను దూషించడమే కాకుండా, సొంత పార్టీలోని బీసీ నాయకులైన కొండా మురళి, సురేఖలను సైతం ఓర్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, శేషగిరిరావు. శ్రావణ్, మహేందర్, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ...

(5వ పేజీ తరువాయి)



సాయిబాబా ఆలయంలో కొలువైన వినాయకుడు

పాయసం, ఉండ్రాళ్ల నైవేద్యంతో ఇంటిల్లిపాది గణపయ్యను కొలిచి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం తమ వాడలో ప్రతిష్ఠించిన మండలాల వద్దకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. నగరంలోని అనేకఅపార్ట్‌మెంట్లలో సైతం గణేష్ చవితి సందడి నెలకొంది. ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక పరిమళాలు గుభాళిస్తున్నాయి. మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇచ్చిన నేపథ్యంలో విద్యుత్ దీపకాంతులను మండపాల ముందు ఈసారి మరింత ఆడంబరంగా తీర్చిదిద్ది వేడుకలు నిర్వహిస్తున్నారు.

వేడుకల్లో ప్రముఖులు

నగరంలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో 55వ వరసిద్ధి వినాయక నవరాత్రి వేడుకలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారి పున్నంచందర్ ఇంటి నుంచి ఆరున్నర అడుగుల ఫీట్ల మట్టి గణపయ్యను ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రతిష్ఠింపజేశారు. అదే విధంగా హనుమకొండ బ్రాహ్మణవాడలో 8 ప్రాంతాల్లో, సుధానగర్‌లో 6 చోట్ల, రెవెన్యూకాలనీ, ఎక్సైజ్ కాలనీ, రామ్‌నగర్, విద్యారణ్యపురి, వికాస్‌నగర్ తదితర అన్ని ప్రధాన ప్రాంతాలలో వందలాది గణపయ్యలను ఆకర్షణీయ మండపాల్లో కొలువుదీర్చి పూజలు నిర్వహిస్తున్నారు.

నగరంలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌లు వారి వారి నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మేయర్ గుండు సుధారాణి వరంగల్‌లో పలు ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న వేడుకల పరంపరలో భాగంగా ఈసారి కూడా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు నిత్యపూజలతోపాటు హోమాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సెప్టెంబరు 5వ తేదీన అన్ని చోట్ల ఒకేసారి గణపతి ప్రతిమలను నిమజ్జనం చేయనున్నారు.

అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

- ఐదుగురు వ్యక్తుల నుంచి 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



దొంగలను అరెస్టు చూపిస్తున్న సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామగ్రి కొనుగోలు చేస్తున్న వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లను దొంగలించిన జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గణపతి ఉత్సవాల్లో భాగంగా లష్కర్‌బజార్, కుమార్‌పల్లి మార్కెట్ ఏరియాల్లో భక్తులు పూజా సామగ్రి తీసుకుంటుండగా దృష్టిమరల్చి జేబుల్లో నుంచి సెల్‌ఫోన్‌లను దొంగలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను ఆదుపులోకి తీసుకుని రూ.1,50,000 విలువ చేసే 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన దొంగల ముఠా ప్లాస్టిక్ కవర్లు అడ్డుపెట్టి రద్దీప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లను దొంగలిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆ ముఠా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రావుఫ్, అశోక్, మహేందర్‌లను సీఐ అభినందించారు.

గణేష్ నవరాత్రి వేడుకలతో ఐక్యత

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధులు


హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద..


హనుమాన్ యూత్ జన్మభూమి జంక్షన్‌లోని గణేషుడు


జ్యోతి వెలిగించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా మొదలైన వినాయక చవితి వేడుకలు


హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందింపజేసి ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ పక్షాన వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి వేడుకలను బుధవారం ఆమె వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి- నీలిమా దంపతులతో కలిసి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, సాంస్కృతిక కార్యక్రమాలకు దాతగా వ్యవహరిస్తున్న లయన్స్ మల్టీపుల్ నాయకుడు బిర్లా ఓపెన్‌మైండ్స్ డైరెక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, ఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలు ఈ ప్రాంత ప్రజల్లో భక్తిభావనను పెంపొందింపజేస్తున్నాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు


వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర పురావస్తు, టూరిజం శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి రూ. 75 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ కావ్య చెప్పారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంలో ఆయన సానుకూలంగా స్పందించారని ప్రసాద్ పథకం కింద చేర్చి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. కుడా ఆధ్వర్యంలో ఆలయం ముందు భాగాన రోడ్డు వెడల్పు, గార్డెన్ ఆధునీకరణల అంటి కార్యక్రమాలను కూడా చేపడతామన్నారు. తొలిరోజు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాహనసేవలో స్వయంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాత్రి ప్రముఖ పురాణ ప్రవచకులు వంగాల సోమయాజులుచే శమంతకోపాఖ్యానం నిర్వహించారు.


లక్ష్మీగణపతిగా...

రెండవ రోజు నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం వేయిస్తంభాల ఆలయంలోని ప్రధాన గణపతిని లక్ష్మీ గణపతిగా అలంకరింపజేసి ఐరావత వాహన సేవ నిర్వహించారు. ప్రముఖ బిల్డర్ వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో మ. ధ్యాహ్నం భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభింపజేశారు. శివానంద నృత్యమాల నిర్వాహకులు బోంపెల్లి సుధీర్ రావు బృందంచే గురువారం రాత్రి కళాకారులు అద్భుత శాస్త్రీయ నృత్యాలతో భక్తులను ఓలలాడింపజేశారు. రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు గండ్రాతి రాజు, చొల్లేటి కృష్ణమాచారి, పులి రజనీకాంత్ తదితరులు సేవలందించారు.


వికశిత యూత్ ఆధ్వర్యంలో బాల గణేషుడిగా కొలువుదీరిన గణనాథుడు


గీసుగొండలోని కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో..


హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో..


కాజీపేట సెయింట్‌పీటర్స్ స్కూల్ సమీపంలో..


రామన్నపేటలో రుద్రాక్షలతో గణనాథుడు


పోచయ్యపేటలో మహావీర్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు


కాజీపేట డీజిల్‌కాలనీలో భారీ గణనాథుడు


హనుమకొండ చౌరస్తా పూల దుకాణాల వద్ద..


జేపీఎన్ రోడ్ సిద్ధివిఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాజుపెంకులతో కొలువుదీరిన గణనాథుడు

హాకీ... ఏకాకి..

- దేశవాళి క్రీడగా ప్రసిద్ధిగాంచిన క్రీడపై నీలినీడలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరాదరణ
- పట్టించుకోని క్రీడా సంఘాలు, అధికారులు



వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడ ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రధానంగా హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్ధమాన క్రీడాకారులకు తర్ఫీదులు అందించే వారు లేకపోవడంతో ఈ క్రీడ పట్ల క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. హాకీ క్రీడపై డీఎస్‌ఏ, అసోసియేషన్లు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో క్రీడాకారులకు ఆట అందని ద్రాక్షలాగా మిగిలింది. హాకీ క్రీడను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం (ఆగస్టు 29) సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని హాకీ క్రీడ స్థితిగతుల పట్ల ప్రత్యేక కథనం..

కోర్టులు లేవు.. కోచ్‌లు కరువు

హనుమకొండ జేఎన్ఎస్‌లో పలు క్రీడలకు మైదానాలు, కోర్టులు ఉన్నప్పటికీ హాకీ క్రీడకు మైదానంతోపాటు కోచ్‌లు సైతం అందుబాటులో లేని కారణంగా ఈ క్రీడ అంతరించిపోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కేయూ, నిట్ కళాశాలలో సైతం విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు హాకీ కోర్టులు అందుబాటులో లేకపోవడం దయనీయం. అయితే 30 ఏళ్లుగా హనుమకొండ నయీంనగర్‌లోని కుడా మైదానంలో కొందరు సీనియర్ క్రీడాకారులు హాకీ క్లబ్ ఏర్పాటు చేసుకొని వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు.

ప్రోత్సహించాలి..

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) పలు క్రీడలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతోంది. 2005కు ముందు జేఎన్ఎస్‌లో అన్ని క్రీడలకు ఉన్నట్లే హాకీ క్రీడకు కోర్టు ఉండేది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు. హాకీ జట్టుకు చీఫ్‌కోచ్‌గా ప్రాతినిథ్యం వహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల సంఖ్యలో క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చి రాష్ట్రానికి, దేశానికి పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందించి రిటైర్డు అయిన చెందిన పెరుమాళ్ మధుకరన్ మన ములుగుకు చెందినవాడే కావడం గర్వకారణం. అదే విధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గతంలో జేఎన్ఎస్ మైదానంలో హాకీలో శిక్షణ పొందినవారే. గతంలో నిత్యం వందల మంది హాకీ క్రీడాకారులతో కళకళలాడే జేఎన్ఎస్.. నేడు అసోసియేషన్ బాధ్యుల సమన్వయలోపంతో బోసిపోతోంది. ఘన చరిత్ర కలిగిన హాకీ క్రీడను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రోత్సహించి జిల్లాకు పునర్వైభవం తీసుకురావాలని పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.



హాకీ క్రీడకు సహకారం



నగరంలో హాకీ మైదానం ఏర్పాటుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారం కోరాం. జిల్లాలో అసోసియేషన్ల సమన్వయ లోపం కారణంగా హాకీ క్రీడను నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. దీనిపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రత్యేక దృష్టి సారించి ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వాల ప్రోత్సాహంతో పాటు కొన్ని ఐటీ కంపెనీలు ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహిస్తే మెరికలాంటి క్రీడాకారులను దేశానికి అందించవచ్చు.

- కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే

అసోసియేషన్ల సమన్వయ లోపం



అసోసియేషన్ల సమన్వయలోపం వల్ల ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడకు ఆదరణ కరువైంది. గతంలో అంతర్జాతీయస్థాయిలో హాకీ ప్రీమియర్ లీగ్ (హెచ్‌పీఎల్) మ్యాచ్‌లు జరిగేవి. ఏదైనా క్రీడల్లో ప్రతిభ కనబర్చాలంటే పిరమిడ్ లాంటి ప్రణాళిక రూపొందించి క్రీడాకారులకు శిక్షణ అందించాలి. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా విద్యార్థులను ప్రైమరీ స్థాయి నుంచే క్రీడల వైపు మళ్లించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ దిశగా తల్లిదండ్రులు, క్రీడా సంఘాలు కృషి చేయాలి.

- పెరుమాళ్ మధుకరన్, ఇండియన్ హాకీ రిటైర్డు చీఫ్ కోచ్

హాకీ కోర్టులు ఏర్పాటు చేయాలి..



గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడకు ఆదరణ ఎక్కువ ఉండేది. దీంతో తర్ఫీదు తీసుకునేందుకు క్రీడాకారులతో హాకీ క్రీడా మైదానాలు కళకళలాడేవి. కానీ కొన్నేళ్లుగా హాకీ క్రీడను సాట్, డీఎస్‌ఏలు పట్టించుకోవడం లేదు. హాకీ క్రీడకు కోర్టులు లేకపోవడంతో విద్యార్థులు ఈ ఆటపై ఆసక్తి చూపడం లేదు. ఏళ్లుగా హాకీ క్రీడను బతికించుకునేందుకు శ్రమిస్తున్నాం. హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు ఏర్పాటు చేయడంతో పాటు కోచ్‌ను నియమించేలా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చొరవచూపాలి.

- ఎం.డి. హుస్సేన్, హాకీ కోచ్, మామునూరు

కోర్టు ఏర్పాటుకు స్థలం లేదు..



హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు నిర్మించేంత స్థలం లేకపోవడంతో కోర్టు ఏర్పాటుకు అంతరాయం ఏర్పడింది. కొన్నేళ్ల కిందట ఇక్కడ హాకీ కోర్టు ఉండేదని పలువురు అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు నా దృష్టికి తీసుకువచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) నగరంలో కోర్టు నిర్మాణం చేయమని ఆదేశాలు ఇస్తే హాకీ కోర్టు నిర్మించే అవకాశం ఉంటుంది.

- జి.అశోక్‌కుమార్, హనుమకొండ డీవైఎస్‌వో

హాకీ స్టిక్స్ కొనేవారు కరువయ్యారు..



గతంలో మా షాపునకు హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేందుకు వందల మంది విద్యార్థులు, క్రీడాకారులు బారులు తీరేవారు. కానీ నేడు ఇతర క్రీడా సామగ్రితో పోల్చుకుంటే హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేవారు రావడం లేదు. ఒకప్పుడు నెలలో 100 నుంచి 200వరకు హాకీ స్టిక్స్ అమ్మకాలు జరిపేది. నేడు యేడాదికి 500 స్టిక్స్ కూడా అమ్మలేక పోతున్నాం. హనుమకొండ నయీంనగర్‌లోని హాకీ మైదానంలో సాధన చేసే క్రీడకారులు, కొన్ని ప్రైవేటు పాఠశాలకు చెందిన క్రీడకారులు మాత్రమే హాకీ స్టిక్స్ కొనడానికి ఆసక్తి కనబర్చుతున్నారు.

- పులి అనిల్ (స్పోర్ట్స్ వేర్ నిర్వాహకుడు, హనుమకొండ)

సాదా బైనామాలకు రైట్ రైట్..

5వ పేజీ తరువాయి

రెవెన్యూ సదస్సుల్లో కూడా భారీగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి.

భూ భారతితో లైన్ క్లియర్

రైతాంగం భూహక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సమస్యలు పరిష్కారం కావటం లేదు. 2020లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు భూ హక్కులను కల్పించే పట్టాదారు పాసు పుస్తకాల చట్టం- 1971ని రద్దు చేసి కొత్తగా పాసుపుస్తకాల చట్టం-2020 ధరణిని తీసుకవచ్చింది. అయితే కొత్త చట్టం ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సాదాబైనామాలతో పాటు అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ధరణిలో ఎలాంటి మార్గాలను చూపించలేదు. దీంతో పాటు గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేయటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయి. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒక్కటి సాదాబైనామా. గతంలో చాలామంది రైతులు తెల్లకాగితాలపై, రెవెన్యూ స్టాంపు పేపర్లపై భూములు క్రయవిక్రయాలు చేశారు. ఇవీ అధికారికం కాకపోవటంతో వీటికి రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఫలితంగా బ్యాంకుల్లో వీరికి రుణాలు కూడా అందటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సమస్యల పరిష్కారంపై ఫోకస్ చేసింది. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రెవెన్యూ గ్రామ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. ఈ సదస్సుల్లో అత్యధికంగా సాదాబైనామాలపైనే దరఖాస్తులు వచ్చాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు మరోసారి భూభారతి సదస్సులో దరఖాస్తులు చేశారు. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించి, సాదాబైనామాలపై మధ్యంతర స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరింది. దీంతో గత ప్రభుత్వం తీసుకవచ్చిన 112జీవో స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం తీసుకవచ్చిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కోర్టు విచారణ అనంతరం సాదాబైనామాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాతే..

కుప్పలు, తెప్పలుగా సాదాబైనామాల దరఖాస్తులు వస్తుండటంతో ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12ఏళ్ల పాటు భూమి స్వాధీనంలో ఉండి, ప్రభుత్వం నిర్దేశించినట్టుగా రాతపూర్వకంగా ఒప్పందంఉంటే సాదా బైనామాలు చెల్లుతాయని ప్రభుత్వం ఇటీవల కోర్టుకు విన్నవించింది. దీంతో పాటు గతంలో సాదా బైనామాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 1,66,784 దరఖాస్తుల్లో ఎన్ని అర్హతలను కలిగి ఉన్నాయో కూడా అధికారులు గుర్తించనున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో నోటీస్ బోర్డులో వివరాలను అంటించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అన్నిరకాల పరిశీలన తరువాతే అర్హులను గుర్తించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందించేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ఆస్తి తగాదాలతో హత్య చేసిన నలుగురికి జీవితఖైదు

వరంగల్ లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల తగాదాలతో వ్యక్తిని హత్య చేసిన కేసులో నేరం రుజువైనందుకు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి బీవీ నిర్మాల గీతాంబ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన మక్కాజి రాజేష్‌. తన తల్లి ప్రమీల, తమ్ముడు ప్రవీణ్, అక్క సరితలతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆ గొడవల్లో పలుమార్లు కుటుంబ సభ్యులంతా కలిసి రాజేష్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో బతుకుదెరువు కోసం వరంగల్ వచ్చి భార్యతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021 జూలై 6న బంధంపల్లి గ్రామంలోని పొత్తులో ఉన్న భూమి ఇంటి స్థలం విషయంలో పంచాయితీలో తేల్చుకునేందుకు వెళ్లారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో అక్కడ ఇంటి ముందు మక్కాజీ రాజేష్‌, తన భార్యతో కలిసి ఉండగా వంగపహాడ్ గ్రామానికి చెందిన బొక్క రాజు, తమ్ముడు మక్కాజీ ప్రవీణ్, తల్లి ప్రమీల, అక్క సరితలు వచ్చి ఆస్తిలో వాటా కావాలా..? అంటూ అందరు కలిసి రాజేష్ అతడి భార్య కళ్లలో కారం చల్లారు. ఈలోగా ప్రవీణ్ బండరాళ్లతో రాజేష్ తలపై తీవ్రంగా కొట్టాడు. బీరు సీసాతో సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అనంతరం నిందితులందరూ ఒక్కసారిగా దాడి చేసి రాజేష్‌ను కత్తితో పొడవగా తీవ్రగాయాలతో చనిపోయాడు. దీంతో రాజేష్‌ను ఇతరుల సహాయంతో భార్య శైలజ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో తన భర్త రాజేష్‌పై దాడి చేసి హత్య చేసిన మక్కాజీ ప్రవీణ్, మక్కాజీ సరిత, మక్కాజీ ప్రమీల, బొక్క రాజులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి హత్యా కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు అయినందున నిందితులకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ గోవింద్ రవికుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా, లైజన్ అధికారిగా కె.హరికృష్ణ, దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌బాబు, ఎం.సాయిరమణ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.



అనాథశ్రమంలో పండ్ల పంపిణీ

వరంగల్ సిటీ. ఆగస్టు 28:(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వడ్డేపల్లి పోలీస్ కాలనీలోని సాయిసేవా ట్రస్టులో అనాథాశ్రమంలో గురువారం సుమన్ మిత్రమండలి అధ్యక్షుడు సినీ నిర్మాత శ్యామల గణేష్ ఆధ్వర్యంలో సినీ హీరో సుమన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లకు పండ్లు, స్వీట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అదే విధంగా భర్త్ డే కేక్ కట్ సంబురాలు జరుపుకున్నారు. సుమన్ మిత్ర మండలి ప్రతినిదులు పొలుసాని సునీల్‌రావు, సోమలక్ష్మి, సోమ నరేందర్, శ్యామల రాకేష్, రాజిరెడ్డి, మహేందర్, రంజిత్, లింగంపల్లి రత్నాకర్ పాల్గొన్నారు.



వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

● రెండో రోజుకు చేరిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ● నగరంలో వివిధ ఆకృతులతో ఆకర్షిస్తున్న విగ్రహాలు ● పలు మండపాల్లో ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు



ఖిలావరంగల్ పడమర కోటలో పూజలు చేస్తున్న భక్తులు



కరీమాబాద్ వినాయక మండపం వద్ద..



విగ్రహాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మ



సునీల్ థియేటర్ వద్ద అన్నదానం దృశ్యం

వరంగల్ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విఘ్నాలను తొలగించే వినాయక మా బాధలను బాపుమయ్యా.. ఓ బొజ్జ గణపయ్యా.. ఉండ్రాళ్లు నీకయ్యా.. అంటూ బాధ్రపద శుద్ధ చవితి పర్వదినం బుధ, గురువారాల్లో నగరంలో భక్తి శ్రద్ధలతో ప్రజలు పూజలతో ఆచరించుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ ఏడాది వివిధ అలంకరణలో, వివిధ ఆకృతులతో ఏర్పాటైన గణేశ్ ప్రతిమలను ఏర్పాటు చేయగా భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఈ ఏడాది అత్యధికంగా వినాయక విగ్రహాలు అమ్మకాలు కొనసాగగా దాదాపు 10 టన్నుల లడ్డూలు విక్రయాలు జరిగాయి.

● చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో గణపతి నవరాత్రోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అర్చకులు కలశ స్థాపన నిర్వహించి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. గురువారం పూజలు కొనసాగాయి.

● వరంగల్ కల్చరల్ : గత 30 ఏళ్లుగా నగరంలోని స్టేషన్‌రోడ్డు ప్రాంతంలో గల సునీల్ థియేటర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రముఖ వ్యాపారవేత్త , మాజీ రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ బొల్లం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తూ ప్రతీ సంవత్సరం తొమ్మిది రోజుల పాటు అన్నదానాన్ని బుధవారం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని బొల్లం సునీల్‌కుమార్ ప్రారంభించారు.

● ఖిలావరంగల్ : నగరంలోని 34, 35, 37, 38, 18 డివిజన్లలోని ప్రధానకూడళ్ళ వద్ద కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, వస్కుల బాబులు వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. అలాగే ఖిలా వరంగల్‌లో భక్తుడు అనుమాస సత్యం వినాయకులను అంద జేశారు.

వినాయక సంఘం ఆధ్వర్యంలో ..

కరీమాబాద్ : కరీమాబాద్‌లోని మైసమ్మ దేవాలయం వద్ద వినాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద గురువారం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోనె రాంప్రసాద్, లత దంపతులు ఆధ్వర్యంలో ఈ మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మరుపల్ల రవి, వినాయక సంఘం ప్రతినిధులు వడ్డెపల్లి రాజేశం, వడ్డెపల్లి భాస్కర్, కందగట్ల నారయణ, వడ్డెపల్లి పున్నం చందర్, కొండబత్తిని రాజు పాల్గొన్నారు. నగరంలోని అండర్ రైల్వే గేటు ప్రాంతం కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, కరీమాబాద్, ఉర్సు, ఏకశి లానగర్ ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.

● శంభునిపేట :నగరంలోని రంగశాయిపేట, శంభునిపేట, ఉర్సు ప్రాంతాలలోని వాడవాడల్లో గణనాదులను ప్రతిష్ఠించారు. వేడుకల్లో కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, కేడల పద్మజనార్దన్, కర్నె రవీందర్, కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, తోట రవీందర్, భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథుడి తొలి పూజల్లో పాల్గొన్నారు. శంభునిపేట జంక్షన్‌లో బుధవారం కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో 500 మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

●మట్టెవాడ : వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజీవ్ ఆధ్వర్యంలో 45 అడుగుల విజయగణపతి మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఒడిస్సాకు చెందిన శిల్పి జయదేవ్ ఆధ్వర్యంలో విగ్రహం రూపుది ద్దుకుంది. వరంగ ల్ మట్టెవాడ, బట్టల బజార్‌లో బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో, ఆర్ఎన్‌టీ రోడ్డులోని బులియన్ మార్చెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పిన్నవారి వీధీలో ఫ్రెండ్స్ అసోషియేషన్ విగ్రహలను ప్రతిష్ఠించారు.

దామెర చెరువులో గణేష్ ఉత్సవాలు

శంభునిపేట : నగరంలోని రంగశాయిపేట శివారులో ప్రకృతి రమణీయతతో కలకళలలాడే దామెర చెరువులో శతాబ్దాల క్రితమే ఆలయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. చారిత్రక కట్టడమైన ఈ చెరువులో ఉన్న గణపతి మండపంలో గణనాథుడు కొలువై ఉన్నాడు. మండపంలో కొలవై ఉన్న గణపతికి దామెర చెరువు స్విమ్మర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యుడు, సామాజికవేత్త శేర్ల అనిల్‌కుమార్ మా ట్లాడారు.. పూజా వేడుకల్లో రిటైర్డ్ జైలర్ శెంకేశి వెంకటేశ్వర్లు, అంకతి రాజేందర్, 120 మంది స్విమ్మర్స్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



దామెర చెరువు మండపం వద్ద పూజలు చేస్తున్న స్విమ్మర్స్

ఎమ్మెల్యే నాయిని అవగాహన లేని వ్యక్తి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గంట రవికుమార్

మిల్స్‌కాలనీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అవగాహన లేకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై వ్యాఖ్యలు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బండిపై నాయిని వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం వరంగల్ చౌరస్తాలో సత్యం కంప్యూటర్ సెంటర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..బండి పై నాయిని చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి, అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులున్నా అభివృద్ధి ఏ మాత్రం జరగడం లేదని ఎద్దేవా చేశారు. వరంగల్ అభివృద్ధికి కేంద్రం స్మార్ట్ సిటీ నిధులు అందజేస్తుందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్ని నిధులు విడుదల చేసిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీస్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రత్నం సతీస్, జిల్లా ప్రధానకార్యదర్శులు బాకం హరిశంకర్, తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్‌కుమార్, రఘునారెడ్డి, కార్యదర్శులు వెంకటేష్, క్రాంతికుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన హక్కుల కోసం పోరాటం

ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజ్జల రామ్‌కిషన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల న్యాయపరమైన హక్కుల కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నిరంతరం పోరాడుతుందని ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ గజ్జల రామ్‌కిషన్ తెలిపారు. తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు సెప్టెంబరు 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ, పాత పెన్షన్ సాధన సభ గోడ పత్రికను గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్ మా ట్లాడు తూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం అనంతరం హైదరాబాద్‌లో జరిగే పాత పెన్షన్ సాధన సభలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజే వేణుగోపాల్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊకంటి అశోక్, టీఆర్‌డీఎఫ్ అధ్యక్షుడు కిషన్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నాగపురి సారంగపాణి, టీఎన్‌జీవోస్ నాయకులు సదానందం, ఇంద్రసేనారెడ్డి, రమాదేవి, రాజేష్, మధుచంద్ర, సుభాష్, రజనీకాంత్, రామకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

మట్టెవాడ ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, 11 మంది వాహనదారులకు రూ. 15,400ల జరిమనా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం గురువారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ కె.సుజాత తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నర్సంపేటకు చెందిన బుర్రి బాబు, పందెం సతీశ్, ధర్మారానికి చెందిన దుబాసి ప్రణయ్‌లకు రెండు రోజుల జైలుశిక్ష విధించారు. వీరిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు రూ.2 వేల జరిమనా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత తెలిపారు.

గణపతి నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి లేదు

కరీమాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల డీజే నిర్వాహకులకు బుధవారం మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. గణపతి నిమజ్జనం సమయంలో ఎలాంటి డీజేలు అనుమతి లేదని, ఉన్నతాధికారుల సూచన మేరకు డీజే నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల ఆదేశాలను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీపీ సన్‌ప్రీత్‌సింగ్, సెంట్రల్‌జోన్ డీసీపీ, ఏఎస్పీ వరంగల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కఠిన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ ఎస్సైలు శ్రావణ్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్లో సెల్‌ఫోన్ల చోరీ

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు28: (ఆంధ్రజ్యోతి) : వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్లో ఇటీవలి కాలంలో వినియోగదారుల సెల్‌ఫోన్లను దొంగలు కొట్టేస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే ఎనిమిది సెల్‌ఫోన్ల చోరీ జరుగగా బుధవారం ఐదు సెల్‌ఫోన్ల చోరీ జరిగింది. దీంతో వినియోగదారులు లబోదిబోమంటూ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు గురువారం సెల్‌ఫోన్ దొంగను పట్టుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే కూరగాయల మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు చెబుతూ వస్తున్నా వాటిని ఏర్పాటు చేయడంలో అధికారులు విఫమవుతున్నారు. ఇప్పటికైనా వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

మేయర్ గుండు సుధారాణి



కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. గురువారం కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం వద్ద జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల మార్ట్ ఏర్పాటు చేసేందుకు కావలసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళలకు ఎన్నో ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలను ఉత్పత్తి రంగంలో ప్రోత్సహించేందుకు వరంగల్ ట్రైసిటీస్‌లో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వరంగల్ సర్కిల్‌కు సంబంధించి కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐదు గదులను కేటాయించి మరమ్మతు చేయిస్తున్నట్టు చెప్పారు. ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు ఖలీల్, ప్రశాంత, ఇన్‌చార్జి ఈఈ సంతోష్‌బాబు, సూపరింటెండెంట్ హబీబ్, ఆర్‌వో షహజాది బేగం, టీపీఎస్‌లు అనీల్, శ్రీకాంత్, ఏఈ హబీబ్ పాల్గొన్నారు.

నగరంలో శిథిల భవనాలను గుర్తించాలి

నగరంలో కూలడానికి సిద్ధంగా ఉండి శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ నగరంలో పలుచోట్ల శిథిలావస్థలో ఉన్న భవనాలను మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను ఎన్ని గుర్తించారు? ఇంకా ఎన్ని భవనాలు కట్టడాలు పాతబడి ఉన్నాయో గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నిబంధనలు ఖాతరు చేయని వారిని గుర్తించి మౌఖిక ఆదేశాలు జారీచేయాలని, తర్వాత మునిసిపల్ సిబ్బందితో కూల్చివేతలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

ఇటీవల భారీగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు నష్టపోకుండా ఉండేందుకు మాన్‌సూన్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం హనుమకొండ పరిధిలోని జవహర్ కాలనీ, గోపాల్‌పూర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలో పర్యటించి చేపట్టవలసిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో మాన్‌సూన్ బృందాలు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డుల వారిగా నియమించిన శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి

మామునూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ 43వ డివిజన్‌లోని మామునూరు పీటీసీలో రూ.91 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లు,స్లాబు కల్వర్టు, డివైడర్ పనులను నగర మేయర్ గుండు సుధారాణితో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆత్మ వంచన లేకుండా పనిచేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. స్థానిక కార్పొరేటర్ అరుణ,పోలీస్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట వీరుల ఆశయాలను కొనసాగిస్తాం..

సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా



తమ్మెరభవన్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి బాషుమియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి

ఖిలావరంగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రజావ్యతిరేక సంస్కరణలను రద్దు చేయాలని హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉద్యమించిన కమ్యూనిస్టులైన అమరులైన పోరాటవీరుల ఆశయసాధన కోసం పోరాటాలను కొనసాగిస్తామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, రాష్ట్ర కమిటీ సభ్యుడు మేకల రవి అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో 2000 సంవత్సరం ఆగస్టు 25న, అప్పటి ప్రభు త్వం జరిపిన కాల్పులలో మృతిచెందిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గుండె బద్రీ, సంఘీ ఎలేందర్, ఓర్సు రాజు, తాళ్ళపల్లి జాన్‌పాల్, ఎమ్డీ అక్బర్‌పాషా, ల్యాదళ్ళ శరత్, సుంకరి భవానీ , నల్లతీగల కుమార్, విజయలక్ష్మి, యాకూబ్, మహేష్, రాజు, చిరంజీవి, రాజేష్, సాంబయ్య, రంజిత్, తస్లీం పాల్గొన్నారు.

● కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణకు పూనుకుంటుందని సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఖిలా వరంగల్‌లోని అమరవీ రుల స్థూపం వద్దను గత 25 సంవత్సరాల క్రితం విద్యుత్‌పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గద్దల ప్రభాకర్, ఇనుముల కృష్ణ, అయిత యాకయ్య, బండి చంద్రమౌళి, ఎమ్డీ అక్బర్, రాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నాయకుల నివాళులు

కరీమాబాద్ : బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ పోరాట అమరులకు సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నివాళులు అర్పించారు. గురువారం ఉర్సు గుట్ట రామసురేందర్ భవనంలో సీపీఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు బషీర్, దుర్గయ్య, ప్రశాంత్, సాంబమూర్తి, ప్రశాంత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత గణేష్ జన్మదిన వేడుకలు



గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ ఓని భాస్కర్

వరంగల్ సిటీ. ఆగస్టు28:(ఆంధ్రజ్యోతి) నగరంలోని 19వ డివిజన్ సొసైటీకాలనీకి చెందిన సినీ నిర్మాత శ్యామల గణేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మిత్రులు, అభిమానులు గణేష్‌ను కలిసి పుష్పగుచ్చాలిచ్చి శాలువాలతో సత్తకరించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. స్థానిక కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, పొలుసాని సునీల్‌రావు,సోమ లక్ష్మి, సోమ నరేందర్, శ్యామల రాకేష్, రాజిరెడ్డి, మహేందర్, రంజిత్, లింగంపల్లి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట.. ప్రజల అవస్థలు




అండర్‌బ్రిడ్జి వద్ద పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

ఖిలావరంగల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో అండర్‌బ్రిడ్జి, ఖమ్మంరోడ్ హనుమాన్ జంక్షన్, చింతల్‌రోడ్‌లలోని పలు కూడళ్ళవద్ద పైప్‌లైన్లు పగిలి నీరు వృథాగా రోడ్లపై పారుతోంది. గత రెండు రోజులుగా ప్రజలు తాగునీరు రోడ్లపై లీకేజీల ద్వారా పోతుండడం చూసిన ప్రజలు ప్రజాప్రతినిధులు, నగరపాలకసంస్థ అధికారులపై మండిపడుతున్నారు. బుధవారం వినాయకచవితి పండుగ కోసం ప్రజలు గణపతి విగ్రహాలను (ప్రతిమ)లను కొనుగోలు చేసి వాహనాలలో మండపాలకు తరలిస్తుండగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు పూజా సామాన్లు కొబ్బరికాయలు, అగర్‌వత్తులు, స్వీట్లు, ఆరటి ఆకులు, చెరుకుగడ, తమలపాకులు తదితర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో బయటకు వచ్చిన భక్తులకు వర్షంతో పాటు, రోడ్లు బురదమ యంగా దర్శనమిచ్చాయి. అండర్‌బ్రిడ్జి వద్ద గత నెలరోజుల క్రితం రోడ్డుపై గుంతలు పడి బస్సులు, కార్లు , ద్విచక్రవాహనాలు, ప్రజలు, మహిళలు నడవలేని పరిస్థితి దాపురి ంచింది. అయినా నగరపాలక సంస్థ, కుడా అధికారులు పట్టించు కోకపోవడం సిగ్గుచేటన్నారు. అసలు వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందా లేదా అంటూ ప్రజలు వాపోయారు. వాహనాదారులు గుంతలలో పడి గాయాలపాలయ్యారు. ఈ సంఘటనలను చూసిన స్థానిక ప్రజలు ముత్తినేని శ్రీనివాస్, ఉపాధ్యాయ్ రాజేష్‌లు రోడ్డుపై ఉన్న గుంతలకు అడ్డంగా ఓ చీర, కర్రలను కట్టి ప్రమాదాలను అరికట్టారు. బుధవారంతో పాటు గురువారం రాత్రివరకు సైతం పైప్‌లైన్ల నుంచి తాగునీరు అలాగే పోతుండడం గమనార్హం. నగర పాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి వరంగల్ అండర్‌బ్రిడ్జి, చింతల్‌రోడ్, ఖమ్మంరోడ్ హనుమాన్ జంక్షన్ వద్దగల పైప్‌లైన్ పగుళ్ళను మరమ్మతు చేసి, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చా లని పలువురు వాహదారులు కోరుతున్నారు.



గుంతలకు అడ్డంగా ఎర్ర చీరను కడుతున్న స్థానిక ప్రజలు



సాదా బైనామాలకు రైట్ రైట్

- హైకోర్టు తీర్పుతో క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన జీవో 112పై హైకోర్టులో కేసు
- పాత చట్టం స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం రావటంతో తొలిగిన అడ్డంకులు
- క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు
- భూ భారతి సదస్సుల్లో భారీగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,66,784 దరఖాస్తులకు కలగనున్న మోక్షం

ఐదున్నరేళ్ల రైతుల ఎదురుచూపులకు తెర

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సాదా బైనామాలకు అడ్డంకులు తొలిగాయి. ఐదున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు ప్రభుత్వం సాదా బైనామాల పరిష్కారంపై విధివిదానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను కొట్టివేసింది. ప్రభుత్వం సాదా బైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2020 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,784దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లోనూ భారీగా సైదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదా బైనామాలకు మోక్షం కలుగుతుందనే ఆనందంలో అన్నదాతలు ఉన్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది సాదాబైనామాలు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్దత కల్పించాలని నిర్ణయించారు. 12 అక్టోబరు 2020లో కూడా జీవో నెంబరు 112ను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన సాదాబైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో జీవో నెంబరు 112ద్వారా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిల్ దాఖాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలును నిలిపివేస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్దత కల్పిస్తుందనే ఆశతో అప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో వరంగల్ జిల్లాలో 26,630 పెండింగ్ సాదాబైనామాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో 27,057 దరఖాస్తులు, జనగామ జిల్లాలో 10,350 దరఖాస్తులు, మహబూబాబాద్ జిల్లాలో 31,250 దరఖాస్తులు, ములుగు జిల్లాలో 20,150 దరఖాస్తులు, భూపాలపల్లి జిల్లాలో 51,347 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల నిర్వహించిన భూభారతి

(మిగతా 7లో..)

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ...

- కన్నుల పండువగా మొదలైన నవరాత్రి వేడుకలు
- వాడవాడనా మండపాల్లో కొలువైన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో కొనసాగిన ప్రతిష్ఠాపన వేడుకలు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు.. ప్రత్యేక పూజలు
- ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడే..


హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జిల్లా ప్రజలు జరుపుకున్నారు. బాద్రప్రద శుద్ధ చవితి బుధవారం ఉదయం 10.30 గంటల వరకు వర్షం ఉండటంతో 11 గంటల తరువాత భాజాభజంత్రీలు, మేళతాళాలతో అట్టహసంగా గణేష్ మండళ్ల నిర్వాహకులు ప్రత్యేకంగా శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపాల్లో గణనాథుడి ప్రతిమలను నిలిపి తొలిపూజలను నిర్వహింపజేశారు. అదే విధంగా బుల్లి గణపయ్యలను ప్రతీ ఇంట ప్రతిష్ఠింపజేసి

(మిగతా 6లో..)



ఎల్లంబజార్‌లోని 45 అడుగుల భారీ గణేషుడు





సత్యం కంప్యూటర్స్ ఆధ్వర్యంలో డ్రైఫ్రూట్స్‌తో కొలువుదీరిన గణనాథుడు, కాకతీయ యూత్ జేపీఎన్‌రోడ్‌లో కొలువుదీరిన గణనాథుడు

జోరుగా వర్షాలు

హసన్‌పర్తిలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. హనుమకొండ జిల్లాలో సరాసరి 26.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. హసన్‌పర్తి మండలంలో అత్యధికంగా 44.2 మి.మీ. వర్షం పడింది. భీమదేవరపల్లి మండలంలో 9.2 మి.మీ, వేలేరులో 20.8 మి.మీ, ఎల్కతుర్తిలో 13.6 మి.మీ, కమలాపూర్‌లో 42.9 మి.మీ, హసన్‌పర్తిలో 44.2 మి.మీ, ధర్మసాగర్‌లో 16.2 మి.మీ, కాజీపేటలో 28.2 మి.మీ, హనుమకొండలో 31.6 మి.మీ, ఐనవోలులో 5.1 మి.మీ, పరకాలలో 33.2 మి.మీ, దామెర లో 38.2 మి.మీ, ఆత్మకూరులో 31.7 మి.మీ, శాయంపేటలో 31.3 మి.మీ, నడికూడలో 20మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరిక కేంద్రం తెలిపింది. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా అతి భారీ వర్షాలు కురవవచ్చునని పేర్కొన్నది.

సీఎంది మోసం.. మాజీ సీఎంది వైఫల్యం..

- పేదల బతుకులంటే ఎందుకింత చిన్నచూపు
- పెన్షన్లు పెంచి, కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోతే యుద్ధమే
- సెప్టెంబర్ 9న హైదరాబాద్ మహాగర్జనను విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి చేసింది మోసమైతే, మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్నదని వైఫల్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. పేదల బతుకులంటే మీకెందుకంత చిన్నచూపంటూ ఇద్దరినీ తూర్పార బట్టారు. ధనిక సామాజిక వర్గంలో పుట్టిన మీకు పెన్షన్‌దారులంటే ఓ రకమైన భావన ఉందని, కానీ పూరి గుడిసెలో పుట్టిన తనకు వారంటే ప్రేమ ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ వారి బాధలను భుజాన వేసుకుని మోస్తూ మిమ్మల్ని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఓ గార్డెన్‌లో గురువారం ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ పెన్షన్ దారుల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబరు 9న సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెన్షన్ దారులైన వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు ఇతరులకు రూ.4వేలు ఇస్తానన్న ముఖ్యమంత్రి మాటలను వీడియో ద్వారా సాక్షాలు చూపుతూ సభలో ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ ఉంటే రూ.2 వేలే, నేనొస్తే రూ.4 వేలంటూ నమ్మబలికించి సీఎంగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని ఆరోపించారు. 20నెలలుగా పెన్షన్ దారులను, కొత్తగా మంజూరి కావాల్సిన వారిని పట్టించుకోకుండా ప్రభుత్వం తప్పించుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 45 లక్షల మంది పెన్షన్‌దారులు, మరో 10లక్షల మంది కొత్తగా మంజూరు కావాల్సిన వారున్నారని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి అధికారంలోకి వచ్చాక ఆ లెక్క మరిచిపోయాడా అని ప్రశ్నించారు. రూ. 200 ఉన్న పెన్షన్‌ను నేడు రూ.2వేల వరకు సాధించేలా పోరాటం చేసిన

(మిగతా 6లో..)



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

హాకీ... ఏకాకి..

- దేశవాళి క్రీడగా ప్రసిద్ధిగాంచిన క్రీడపై నీలినీడలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరాదరణ
- పట్టించుకోని క్రీడా సంఘాలు, అధికారులు

7

కొత్త పత్తి వచ్చేసింది..

ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన రైతు



కొత్తపత్తిని అమ్మకానికి తీసుకువచ్చిన రైతుతో అడ్తిదారు, ఖరీదుదారు

6

తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలి

సంగెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గవిచర్లలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం రైతు సంఘం ప్రతినిధుల బృందం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు కురిసి మొక్కజొన్న, పత్తి పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు దెబ్బతిన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు నమ్మి అధికారం అప్పగించినప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నదని అన్నారు. రైతులకు రైతు బంధును, రుణమాఫిని పూర్తిస్థాయిలో అందించలేకపోయిందన్నారు. యూరియాను సకలంలో అందించడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. వ్యయప్రయాసాలకు ఓర్చి రైతులు వేసిన పంటలకు పకృతి పగబట్టి పంటలను నేలమట్టం చేసిందన్నారు. రైతులకు మనోధైర్యాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు బోరున విలపిస్తున్నారన్నారు. రైతంగం వేసిన పంటలకు ప్రభుత్వం బరోసా కలిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలకు బీమా వర్తింపచేయాలన్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట వివరాలను సేకరించి నష్ట పరిహారం అందించిఆదుకోవాలని అన్నారు. రైతుల పక్షన పోరాటం చేసేందుకు వెనకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోలేని తీరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోరులో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.


నర్సంపేటలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


రాయపర్తిలో గణపతి సామగ్రిని పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి


తిమ్మంపేటలో..


ఖానాపురంలో..

కొలువు దీరిన గణనాథులు

• మండపాల వద్ద భక్తుల సందడి

• భక్తి శ్రద్ధలతో పూజలు

నర్సంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జై గణేశా.. జై కొడతాం గణేశా.. అంటూ గ్రామాలు, వాడవాడలా, పట్టణంలో వినాయకచవితిని పురస్కరించుకొని వినాయక మండళ్ల ఉత్సవ కమిటీల సభ్యుల బుధవారం వర్షం కురుస్తున్న సమయంలోనే మండపాల్లో గణనాథులు కొలువు దీరారు. నర్సంపేట ప్రాంతంలోని ప్రజలు తమ ఇళ్లల్లో వినాయకుడికి పూజించారు. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిదిరోజుల పాటు వినాయకుడిని పూజించేందుకు ఉత్సవ కమిటీలు వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. గణపతివి గ్రహాలను వాహనాల ద్వారా ఊరేగింపుగా తీసుకెళ్లి శోభాయమానంగా అలంకరించిన మండపాలల్లో ప్రతిష్టించి భక్తులు, మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి నవరాత్రోత్సవాలను ప్రారంభించారు. పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయంవద్ద, ఆర్యవైశ్యసంఘం భవనం ఆవరణలో పూజలుచేశారు, పద్మశాలిగార్డెన్ పద్మశాలిసంఘం సభ్యులు, వస్త్రవ్యాపారుల ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాల సమీపంలో. పోచమ్మగుడి వద్ద ఆలయ కమిటీ సభ్యులు, వల్లబ్‌నగర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, నెక్కొండరోడ్, రెడ్డిపంక్షన్‌హాల్ సంఘం ప్రతినిదులు, ద్వారకపేటరోడ్, పాఖాలరోడ్, వరంగల్‌రోడ్, కూరగాయమార్కెట్ ఆవరణలో కమిటీ, ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో గణపతిని ప్రతిష్టించారు. పట్టణంలోని పలువార్డుల్లో సుమారు 200పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి బుధ, గురువారాల్లో పూజలు నిర్వహించారు. 25వ వార్డులో ఏర్పాటు చేసిన గణపతికి ఆవార్డు భక్తులతో కలిసి పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మాజీకౌన్సిలర్ లక్ష్మి దంపతులు పూజలు చేశారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

మట్టి గణపతి ప్రతిమల ఉచిత పంపిణీ

వినాయక చవితి పండగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణానికి చెందిన పలు సంఘాలు, పలువురు పర్యావరణ వేత్తలు ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో ప్రజలకు పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్, సంఘ సభ్యులు మట్టిగణపతుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కన్యామార్టు వద్ద గందె వెంకటేశ్వర్లు, ఇతర వ్యాపారులు కలిసి ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ వేత్త గోకారామస్వామి తన ఇంటి వద్ద మట్టితో తయారుచేసిన విత్తన గణపతి ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే అయిదురకాల పూజకు అవసరమయిన పత్రులను అందజేశారు.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గణనాథులు కొలువుదీరారు. మండలంలోని పెర్కవేడు గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతికి ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా టీపీసీసీ జిల్లా మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో బిల్లా శివాని రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో 250 గణపతి మండపాల నిర్వాహకులకు 9 రోజుల అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు.

• ఖానాపురం(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా వినాయక చవితివేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో వాడవాడలా ఏర్పాటుచేసుకున్న వినాయక మండపాలలో భక్తుల నృత్యాల కోలాహల మధ్య గణనాథులు కొలువుదీరారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా గణనాథులు బుధవారం వెలిశాయి. మండల కేంద్రంలో యువసేనా యూత్ ఆధ్వర్యంలో, చైతన్య యూత్, నెంబర్‌వన్ కాలనీలో, కట్టయ్యపల్లెలో, ఉప్పరపల్లి రోడ్డులోని ప్రధాన సెంటర్‌లో భారీ వినాయక విగ్రహాలను, సిద్దేశ్వరాలయంలో గణనాధుల విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు.

• వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పట్టణ కేంద్రంలో వినాయక చవితి పురష్కరించుకొని బుధవారం వివిధ కుల సంఘాలు, యువజన విభాగాల ఆధ్వర్యంలో వాడవాడలా గణపతి విగ్రహాలకు అందంగా మండపాలు అలంకరించి పండితుల మంత్రోచ్చరణలతో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. బుధ, గురువారాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వాడవాడలా గణనాథులను బుధవారం ఏర్పాటుచేసి నవరాత్రోత్సవ వేడుకలను ప్రారంభించారు. గణేశ్‌డికి నవరాత్రుల పూజలు జరపడంతో పాటు పూజల్లో పాల్గోనే భక్తులకు సౌకర్యాలను నిర్వహకులు ఏర్పాటు చేశారు. పెద్దలతో పాటు పిల్లలు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోఏర్పాటు చేసిన వినాయక మండపాలలో గణనాథులు కొలువుదీరారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేధ్యం సమర్పించారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండపాల్లో గణనాథులు కొలువు దీరారు. యువజన సంఘాలు, కుల సంఘాలు, ఇతర సం ఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు, వీధుల్లో, ప్రధాన కూడళ్లలో దర్శన మిస్తున్నాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గణపతి నవరాత్రిఉత్సవాలు యువకులు నిమగ్నమై తమ భక్తిని చాటుకున్నారు.

• దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో 98 వినాయక విగ్రహాలను ఏర్పా టుచేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా వినాయక పండుగ నిర్వ హించుటకు స్థానిక ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతూ జాగ్రత్తలను నిర్వహకులకు తెలిపారు.

• గీసుగొండ(ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. గణపతి మండపాలను ప్రత్యేక అలంకరించి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ధర్మారం వద్ద కమర్షియల్ హోల్‌సేల్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన కల్పవృక్షం కింద ఉన్నట్లు ఉన్న వినాయక విగ్రహం భక్తులను ఆకర్షిస్తుంది. పలు మండపాల్లో మట్టి విగ్రహాల ఏర్పాటుకు నవరాత్రి ఉత్సవాల కమిటీలు నిర్వాహకులు ప్రాధాన్యత ఇచ్చారు. కాగా గణపతి మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సీఐ మహేందర్ సూచించారు.


నెక్కొండలో..


గీసుగొండలో..


చెన్నారావుపేటలో..

పల్లెల అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


పత్తిపాక తండా వీధులో అంతర్గత రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, సీఈవో రామిరెడ్డి

నెక్కొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికే మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. జడ్పీసీఈవో రామిరెడ్డితో కలసి గురువారం మండలంలోని పత్తిపాక, సాయిరెడ్డిపల్లి గ్రామలు, శివారు తండాలో అంతర్‌గత రోడ్లను పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే రోడ్డుమార్గంతోటే సాధ్యమవుతుందని తెలిపారు. పత్తిపాక తండాల్లో రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువలు ఎంతో అవసరం ఉందని, నెక్కొండ-పత్తిపాక గ్రామాల మధ్య నెక్కొండ చెరువు మత్తడి వద్ద లోలెవల్ వంతెన నిర్మాణం అవసరం ఉందనే విషయాన్ని జడ్పీసీఈవో రామిరెడ్డి, పీఆర్ ఈఈ ఇజ్జగిరిలకు తెలిపారు. త్వరలో మురికి కాలువలు, లోలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, డీసీసీ కార్యదర్శి హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు సాయికృష్ణ, నాయకులు తిరుమల్, గరికపాటి హన్మంతరావు, చల్లా శ్రీపాల్‌రెడ్డి, బండి శివకుమార్, శ్రీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ , బోడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ సవరణ చట్టాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి


నర్సంపేటలో విద్యుత్ అమరులకు నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గురువారం విద్యుత్ పోరాట అమరవీరులు రామకృష్ణ, బాలస్వామి, విష్ణు 25వ వర్ధంతిని డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన నిర్వహించారు. విద్యుత్ అమరులకు నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి రాష్ట్రాల పరిధిలోని విద్యుత్ రంగాన్ని కేంద్రం పరిధిలోకి తీసుకు వచ్చి నూతన విద్యుత్ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందన్నారు. ఈక్రమంలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమవుతుందని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా కరెంట్ బిల్లులు చార్జీలను పెంచేందుకు పూనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడిరా ష్ట్రంలో చం ద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ విధానాలకు లోబడి డిస్కంలు విడగొట్టి ప్రవేటీకరించినందుకు వామపక్షపార్టీలు, ప్రజలు పోరాడారన్నారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు విద్యుత్ జోలికి పోలేదన్నారు. విద్యుత్ చార్జీలను పెంచినా, విద్యుత్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోని ఎడల కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, కేశెట్టి సదానందం, కర్నె సాంబయ్య, భైరబోయిన నరసయ్య, గుర్రం రవి, గణిపాక బిందు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ అమరవీరులకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపల్లి బాబు, నాయకులు కొరగోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ నివాళులర్పించారు. పట్టణం లోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులు అర్పించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో పరికి మధుకర్, అన్వర్, కలకోట అనిల్, ఎండి.ఫరీదా, వజ్జంతి విజయ, నాగమణి పాల్గొన్నారు.

• నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన బషీర్ బాగ్ పోరాటంతోనే రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకం వచ్చిందని సీపీఐ పార్టీ జిల్లా నేత చింతకింది కుమారస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బషీర్ బాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. నాటి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ చార్జీలు పెంచడంతో యావత్తు రైతాంగంతో కలిసి సీపీఐ తీవ్రమైన పోరాటం చేసిందన్నారు. అనంతరం వచ్చిన వైఎస్ రాజశేకర్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కడియాల క్రాంతికుమార్, మామిండ్ల చిన్న ఐలయ్య, మామిండ్ల పెద్ద ఐలయ్య, భూస కుమారస్వామి, బాషబోయిన సమ్మయ్య, రాజయ్య, రవి పాల్గొన్నారు.

• సంగెం (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోసం పోరా టం చేసిన వారిపై కాల్పులు చేయగా మృతిచెందిన వారికి ఎంసీపీఐ నేతలు ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని కుంటపల్లిలో మండల పార్టీ సమావేశం జరిగింది. పార్టీ మండల కార్యదర్శి ఎమ్డీ.ఇస్మాయిల్ మాట్లాడారు. కార్యక్రమంలో గోనే రామచందర్,జక్క అశోక్,రౌతు శ్రీనివాస్,సాంబయ్య, పాపయ్య, ఉప్పలయ్య, వెంకటస్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

ఖానాపురం, ఆగస్ట్ 28 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాలలో డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదని ఎస్సై రఘుపతి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8మంది డీజే నిర్వాహకులను తహసీల్దార్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సై రఘుపతి వారికి పలు సూచనలు చేశారు.

వలలో చిక్కిన కొండచిలువ

నల్లబెల్లి, ఆగస్టు 28 (ఆంధజ్యోతి) : చేపల వలలో కొండచిలువ చిక్కిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ముదిరాజ్ కులస్థుల కథనం ప్రకారం.. మండలంలోని రుద్రగూడెం ఎర్ర కుంట చెరువు, దొప్పని చెరువుల మధ్యన మత్తడి వద్ద ముదిరాజ్‌లు చేపలు వెళ్లకుండా వలను కట్టారు. ముదిరాజ్‌లు గురువారం ఉదయం మత్తడి వద్ద నున్న వలను పరిశీలిస్తున్న క్రమంలో వలలో పెద్ద కొండచిలువ చిక్కింది. అప్పటికే కొండ చిలువ వలలో మృతి చెంది ఉంది.

ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి

పర్వతగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధికార ప్రతినిధి చల్ల వెంకన్న డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గురువారం జాతీయ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్‌గాంధీకి పోస్టు కార్డులు చేరవేశారు. కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు గురుగు రాజు, నాగరాజు, గఫార్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి పాల్గొన్నారు.

వాయిల్‌తండా రోడ్డుకు మరమ్మతులు

చెన్నారావుపేట. ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాయిల్ తండా గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు గ్రామ యూత్ సభ్యులు గురువారం మరమ్మతులు చేపట్టారు. గ్రామానికి చెందిన గ్రామ యూత్ ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతుల్లో భాగంగా మట్టిపోశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డుకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో యూత్‌సభ్యులు గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బోడ నరేశ్, ఉపాధ్యక్షుడు జరుపుల నవీన్, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను బీమా కంపెనీలకు అప్పగిస్తే ఉద్యమం

దుగ్గొండి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను బీమా కంపెనీలకు అప్పగిస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ మండల మహాసభ నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కార్మికుల ప్రమాద బీమా రూ.6లక్షల 30 వేలకు బదులు రూ:10లక్షలకు పెంచాలన్నారు. లేబర్ కార్డుల రెన్యూవల్‌లో ఆన్‌లైన్‌లో వస్తున్న ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. భవన కార్మికులు కలసి కట్టుగా ఉద్యమించాలన్నారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షుడు అరూరి కుమార్, మండల అధ్యక్షుడు బొల్ల కొంరయ్య, బొల్ల సాంబయ్య, చల్లా నర్సింహారెడ్డి, సంపత్ భిక్షపతి, సురేశ్, రమేశ్, రాజక్క మహేందర్, రవి, రాజు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మంపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

దుగ్గొండి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేటలోని ఎస్సీ కాలనీలో అధిక లోడ్ కారణంగా తరచూ విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కాలిపోవడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకపోగా ట్రాన్స్‌పార్మర్‌ను మంజూరు చేశారు. ట్రాన్స్‌పార్మర్‌ను గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్త పరచారు. ట్రాన్స్‌పార్మర్ కాలిపోవడంతో నెల రోజులుగా చీకట్లో కాలం గడిపినట్లు కాలనీ వాసులు వెల్లబుచ్చారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రొట్టె రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ట్రాన్స్‌ఫారం మంజూరి చేయించామన్నారు. త్వరలో మరో ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

ఆసరా పెన్షన్‌దారులను మోసం చేస్తున్న సర్కార్

• ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

గీసుగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలు దాటిన ఆసరా పెన్షన్‌దారులకు పెన్షన్‌లు పెంచకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఊకల్‌లోని ఓ గార్డెన్‌లో గురువారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్దులు, వితంతువులతో పాటు పలు రకాల పెన్షన్‌లు పెంచాలని సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. 2023 డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజున వికలాంగులకు రూ.6వేలు, వృద్దులు ఇతరుల ఆసరా పెన్షన్‌లను రూ.4 వేలకు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. గతంలో ఇస్తున్న 45లక్షల పెన్షన్‌లతో పాటు మరో 10 లక్షల కొత్త పెన్షన్‌లు ఇస్తామన్నారని ఆయన గుర్తుచేశారు. ఇండ్లలో కూచోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తిట్టుకోవటమే తప్ప పేదల సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. ప్రతి పక్ష నాయకుడిగా అసెంబ్లీకి వచ్చి కేసీఆర్ ఎందుకు గళం వినిపించటం లేదని ప్రశ్నించారు. పక్కన ఉన్న రాష్ట్రంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పెన్షన్‌లను పెంచి ఇస్తున్నారన్నారు. చంద్రబాబు శిష్యరికంలో పెరిగిన సీఎం రేవంత్‌రెడ్డికి, కేసీఆర్‌కు ఆ మాత్రం సోయి కూడా లేదన్నారు. దశాబ్దాల కాలంగా పోరాటం చేసి రూ. 200 పెన్షన్‌లను రూ. 2 వేలకు తీసుకువచ్చామన్నారు. ఇపుడు అదే పోరాట పటిమతో వృద్దులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, చేనేత, గీతా కార్మికులకు, డయాలసిస్ బాధితులకు రూ. 4వేలు, వికలాంగులకు రూ.6 వేలు, కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15 వేల చొప్పున పెన్షన్‌లు సాధించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు, వీహెచ్‌పీఎస్ నాయకుల అడ్డగట్ల రజిని, ఎండీ రఫీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య, చిన్నపెల్లి రవి, అక్కెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, పద్మశ్రీ పురస్కారం పొంది తొలిసారిగా గీసుగొండకు వచ్చిన మంద కృష్ణమాదిగను ఎమ్మార్పీఎస్ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కాగా బీజేపీ నాయకులు గట్టికొప్పుల రాంబాబు, రవికుమార్‌లతో పాటు పలువురు నేతలు మంద కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

మంద కృష్ణ సభకు మద్దతు తెలిపిన కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డులోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ పెన్షన్‌దారుల సన్నాహక సభకు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌దారులకు పెంచి ఇవ్వడంతో పాటు కొత్తవారికి మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వనాల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

30వరకు అభ్యంతరాలను స్వీకరిస్తాం

పర్వతగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో తప్పులుంటే తెలియజేయాలని ఎంపీడీవో శంకర్ నాయక్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యాలయంలో డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు పబ్లిష్ చేశారు. వార్డు వారీగా అభ్యర్థలను ఉంటే ఈ నెల 30వ తేదీలోపు తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు.

• (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదే శాల మేర కు స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం మండల ఓటరు జాబితాను ఎంపీడీవో పసరకొండ రవి ప్రకటించారు. ఈ నెల 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. మండలంలోని అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, సెప్టెంబరు 2వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. ఇప్పటి వరకు మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు గాను 252 వార్డులు, మొత్తంగా 31,664 ఓటర్లను ప్రకటించామన్నారు.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని 40గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీవో కార్యాలయంలో జీపీ ఓటర్ల జాబితాను ఎంపీడీవో కిషన్ ప్రదర్శించారు. ఈ నెల 30 వ తేదీలోపు వివిధ పార్టీల నాయకులు వాటిని పరిశీలించి ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ లిస్టులను గ్రామపంచాయతీ అధికారులు ప్రదర్శించారు. ఈనెల 30 తేదీలోపు ఓటర్ల జాబితాల పై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తెలపాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ కోరారు. మండలంలోని కట్ర్యాల గ్రామంలో కార్యదర్శి శ్రీనివాస్ అన్ని పార్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఓటర్ల లిస్టును వివరించారు.

• సంగెం (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఓటరు లిస్టులను సంగెం ఎంపీడీవో కాసర్ల రవీందర్ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 41,459 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఇందులో 20,213 మంది మహిళ ఓటర్లు, 21,245 మంది పురుషుల ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.